International Journal of Academic Research
ISSN: 2348-7666 Vol.1 Issue.2, August, 2014

# ప్రజాకవి - కాళోజీ నారాయణరావు

**డా॥ దోనెంపూడి నారాయణరావు**
తెలుగు ఉపన్యాసకులు
శ్రీ అనంత పద్మనాభ కళాశాల,
వికారాబాద్, రంగారెడ్డి జిల్లా, ఆంధ్రప్రదేశ్-501101

**జీవితం – విద్యాభ్యాసం :** కాళోజీ నారాయణరావు గారి పూర్వీకులు మహారాష్ట్రానికి చెందిన నియోగి బ్రాహ్మణులు. పీష్వాల పాలనలో నిజాం వద్ద సుంకాలు వసూలుకి వచ్చి బీదరు, బీజాపూర్, వరంగల్లు ప్రాంతంలో స్థిరపడ్డారు. 'నరహరిపంత్' హనుమకొండలో స్థిరపడ్డారు వీరి నాలుగు తరాల తరువాత వారు 'రంగారావుగారు. ఈయనకి కర్ణాటకకు చెందిన రమాబాయమ్మని చేసుకుంటే వాళ్ళకి రామేశ్వరరావు, నారాయణరావు అనే ఇద్దరు కొడుకులు కలిగారు. రామేశ్వరరావుని పెద్దకాళోజీ అంటారు. ఈయన షాద్ పేరుతో ఉర్దూలో కవిత్వం రాసారు.

కాళోజీ నారాయణరావు సెప్టెంబరు 9,1941న బీజాపూర్ జిల్లా రట్టహళ్ళిగ్రామంలో జన్మించారు. ఈయన అసలు పేరు 'రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాస్ రావు రాంరాజా కాళోజీ' వీరి ఇల్లు హైదరాబాదు సంస్థానానికి ప్రతీకగా ఉండేది. రాజ్యంలో మరాఠీ, కన్నడ, తెలుగు, ఉర్దూ భాషలు వ్యవహారంలో ఉన్నట్లే తల్లి నుండి కన్నడం తండ్రి వైపున మరాఠి, ఉండేది తెలుగునేల, అధికార భాష ఉర్దూ. ఇలా విశాలమైన ఏవిధమైన సంకుచితత్వం లేకుండా పెరిగారు. కాళోజీ బాల్యంలో తల్లి చనిపోతే అన్న రామేశ్వరరావు అంతా తానై పెంచారు. దీన్ని కాళోజీ "ఎనిమిది సంవత్సరాలప్పుడు మా అన్న భుజాలెక్కాను ఎనభై సంవత్సరాల వరకు మోస్తూనే ఉన్నాడు" అంటూ మా అన్నే నన్ను పెంచాడన్నారు.

కాళోజీ విద్యాభ్యాసం 'మడికొండ'లో తండ్రి రంగారావు వద్ద, వానమామలై వెంకచార్యులు వద్ద ప్రాథమిక విద్య ఉర్దూ, తెలుగు, సంస్కృతం, ఆంగ్లభాషలు, లెక్కల్లో శిక్షణ పొందారు. మడికొండ నుండి అన్న వాకాలత్ కోసం హైదరాబాద్ వెళితే అన్నతో హైదరాబాద్ వచ్చి సుల్తాన్ బజార్ దగ్గర రెసిడెన్సిస్కూల్‌లో (1926) సిటీకాలేజీ హైస్కూల్లో చదువుకున్నాడు. తర్వాత అన్న రామేశ్వరరావుతో వరంగల్లు వచ్చి హైస్కూలు విద్య పూర్తిచేసి ఇంటర్‌లో చేరాడు. ఆయనకు ఇంటర్‌లో ఉన్నపుడే క్షయవ్యాధిసోకింది.

ఇంటర్‌లో కళాశాల విద్యార్థి సంఘ కార్యదర్శిగా పనిచేసాడు. 'గణేష్' ఉత్సవాలకు సెలవు ఇవ్వకపోతే, విద్యార్థులందరితో రాత్రికిరాత్రే సెలవుపెట్టించాడు. గ్రంథాలయోద్యమంలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. 'కాళోజీని' గ్రంథాలయోద్యమ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు ఆంధ్రగ్రంథాలయ ఆస్థానకవి అని ప్రశంసించారు. వీరికి ఈ ఉద్యమం 1931లో హనుమకొండలో జరిగిన రాజరాజనరేంద్ర భాషానిలయం రాజతోత్సవ సభలతో పరిచయమయింది. తెలంగాణాలో స్వయంగా మిత్రులతో కలిసి వరంగల్లు పబ్లిక్ పార్కులో నెహ్రూ గ్రంథాలయాన్ని, పల్లగుట్ట, ఘనాపురంలో ఇంకోగ్రంథాలయాన్ని స్థాపించారు. 1942 శబ్దానుశాసన గ్రంథాలయ రజతోత్సవంలో చురుకుగా పాల్గొని పెద్దల అభినందనలందుకున్నారు.

వరంగల్లులో మొహరం పండగ సందర్భంలో ముస్లింలు, హిందువుల గ్రామదేవత మైసమ్మని తొక్కుతున్నారని పసుపుకుంకమ చల్లించి ఆ పనిని అడ్డుకున్నాడు. తనమేనమామ నరేంద్రదేవ్ వల్ల ఆర్యసమాజ్ వారి కార్యక్రమాల్లో, వారి పిలుపుతో సత్యగ్రహంలో పాల్గొన్నాడు. 'ఆర్యసమాజం' బోర్డు పెట్టి నిరసన తెలిపాడు. 1939లో పంచమార్య కవి సమ్మేళనంలో పాల్గొన్నారు.

నాటి రాజకీయ, సాంస్కృతిక చైతన్యానికి కారణమైన ఆంధ్రమహాసభ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొన్నారు. స్టాండింగ్ కౌన్సిల్ మెంబరు. 1935, 5వ ఆంధ్రమహాసభ (షాద్‌నగర్) తీర్మానాన్ని ప్రవేశపెట్టి, బహిరంగ సభలో ఉపన్యసించారు. 11వ మహాసభ భువనగిరిలో (1944) చీలికి వచ్చినపుడు మితవాద పక్షంలో ఉన్నారు.

హింసతప్పు రాజ్యహింసమరీతప్పు, అంటూ పౌరహక్కుల ఉద్యమంలో దూకడానికి వీరికి సేనాపతి బాపత్ ఆదర్శం. ఆతర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సివిల్ లిబర్టీస్ కార్యకర్తగా, భార్గవ కమీషన్‌లో సభ్యుడిగా నక్సల్స్ ఉద్యమాన్ని సమర్ధించారు. ప్రహ్లాదుడిని రక్షించడానికి హిరణ్యకశిపుని చంపిన నరసింహస్వామి విప్లవకారుడైతే, ప్రజల కోసం దుష్టప్రభుత్వాలని సంహరించే నక్సలైట్లు అటువంటివారంటారు. 1939లో నిజాం ప్రభుత్వం రాజ్యాంగ సవరణలు తెస్తే దానికి నిరశిస్తూ సున్నపుకుండకు మెతుకులుబూసి / అన్నమనుటెందులకు / గుడ్డనుబట్టి మనిషినికోసే ఎడ్డిదర్జీతనమెందులకు' అంటారు.

కాళోజీ 1939లో, 1947 సంవత్సరాల్లో రెండు సార్లు జైలుశిక్ష అనుభవించారు. 1946లో వరంగల్లు నగర బహిష్కరణ శిక్ష పొందారు. జైలులో ఉన్నప్పుడు దాశరధి కృష్ణమాచార్య, వట్టికోట ఆళ్వారు స్వాములను కలిసారు. జైలు సమస్యలపై నిరాహారదీక్ష చేసారు.

1939లో వకాలత్ పూర్తి చేసి, 1940లు వకీలుగా పేరు నమోదుచేసుకొని, ఒద్దిరాజు రాజేశ్వరరావు వద్ద జూనియర్‌గా ప్రాక్టీసు చేసారు. కాళోజీకి 1940లోనే 'రుక్మిణి' గారితో వివాహమైంది.

ఆంధ్రసారస్వతపరిషత్తు' ఏర్పాటు చేసినప్పటి నుండి దాని ఎదుగుదలలో ఉన్నారు. ద్వితీయ వార్షికోత్సవం వరంగల్లులో 1944లో డిసెంబరు 28,29,30 తేదీలలో జరిగినప్పుడు 'ఆహ్వానసంఘం కార్యదర్శి'గా ఘనంగా నిర్వహించారు.

మడికొండలో తనకి తెలుగు కవిత్వంపై శిక్షణనిచ్చిన గురువు గార్లపాటి రాఘువరెడ్డిగారితో కలిసి "ఆంధ్రసారస్వత సంఘం' వరంగల్లులో స్థాపించి పదిహేనురోజులకి ఒకసారి సమావేశాలు నిర్వహించారు. ఈ సంస్థే తరువాత 'మిత్రమండలి'గా మారింది. దీనినుండే వరవరరావు, అంపశయ్య నవీన్, తిరుపతయ్య వంటి ప్రముఖ సాహితీకారులు వచ్చారు. 1952 సం॥లో తెలంగాణ రచయితల సంఘం స్థాపక ఉపాధ్యాక్షులు, 1954 రెండో వార్షికోత్సవంలో అధ్యక్షోపన్యాసంచేసారు. కవులు, రచయితలు ప్రజాహృదయాన్ని ఆవిష్కరించాలని పిలుపునిచ్చాడు.

1952 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీచేసి స్వల్పతేడాతో ఓడిపోయారు. 1958లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి విధానమండలికి ఎన్నికయ్యారు. 1960లో ఓడిపోయారు. 1975లో ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితిని దుయ్యబట్టారు. 1975లోనే ప్రపంచ తెలుగుమహాసభలను బహిష్కరించారు. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుగారిపైన స్వతంత్ర అభ్యర్థిగా 'సత్తుపల్లి' నియోజకవర్గంలో పోటీచేసారు.

కాళోజీ తొలి రోజుల్లో 'ఆంధ్రప్రదేశ్'కు అనుకూలంగా ఉద్యమించారు. 1968 నాటికి అతనికి ఉమ్మడి రాష్ట్రంలో భ్రమలు తొలగి నీళ్ళు, నిధులు, ఉద్యోగాల్లో దోపిడీ జరుగుతుందని రెండున్నర జిల్లాల భాషాసంస్కృతులు మనమెదళ్ళని పాలిస్తున్నాయని తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకోసం చనిపోయేవరకు నిజాయితీగా పోరాడారు.

1956లో శ్రీశ్రీతోకలిసి ఆసియా రచయితల సమావేశానికి హాజరయ్యి నివేదికనిచ్చారు. 1982,1984లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సత్కారం, 1985లో విశ్వసాహితీ సంస్థ సన్మానం. 1984లో'కళాసరస్వతి' బిరుదు ప్రధానం, 1983లో బూర్గుల స్మారక అవార్డు. 1992లో భారతప్రభుత్వం వీరికి 'పద్మభూషణ్'తో సన్మానించింది. పివి నరసింహారావు, పల్లా దుర్గయ్య, వానమామలై వరదాచార్యులు సహపాఠ్యులు వీరు నవంబరు 13- 2002న 'పుటుక నీది / చావునీది బ్రతుకంతా దేశానిది" తనే అన్నట్లుగా జీవించి మృతిచెందారు.

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన, స్వాతంత్ర్యం వచ్చాక హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను, రాజ్యహింసకు తీవ్రంగా నిరసించాడు. ప్రజాఉద్యమాల్లో, బాధల్లో ఎంతగా కదిలిపోయాడు కాబట్టే 'ప్రజాకవి' అయ్యాడు. తన చేతల్లో ఆలోచనల్లో, ఆవేదనల్లో వేష భాషల్లో తెలంగాణా ప్రజలపక్షాన, మనిషి పక్షాన ఆర్ద్రతతో స్పందించారు. అందుకే దాశరధి "తెలంగాణ ఆధునిక సాహిత్య ముఖద్వారం కాళోజీ" అన్నారు. ఆయన ఏ పార్టీలో సభ్యులు కాకపోయిన పార్టీ సభ్యులుకన్నా ప్రజలకు, ప్రజాసంఘాలకు పౌరహక్కులకు, ప్రజాస్వామ్య విలువలకు దన్నుగా నిలిచారు.

**కాళోజీ రచనలు :** 1) నా గొడవ 2) జీవనగీత 3) నాదేశ యాత్ర 4) అనువాద రచనలు 5) ఇదీ నా గొడవ వారి ముఖ్యమైన రచనలు.

**నా గొడవ :** కాళోజీ నారాయణరావు తాను రాసిన కవిత్వాన్ని 'నా గొడవ' పేరుతో రాసారు. ఆయన కవిత్వాన్ని పేరుకోసం, సంపాదనకోసం రాయలేదు. ప్రతి ఉద్యమ సందర్భంలో దేశంలో, రాష్ట్రంలో, తెలంగాణాలో జరిగిన ప్రతిముఖ్యమైన సంఘటనను తన కవిత్వం ద్వారా 'రన్నింగ్ కామెంట్రీగా' వ్యాఖ్యానించాడు. ఆయన లక్ష్యం తాను చెప్పాలనుకున్నది.ఎదుటివాని గుండెకు ఆర్ద్రంగా తాకడం ప్రజల్ని చైతన్యవంతంచేసి, ఉద్యమాభిముఖంగా సిద్ధంచేయడం.

కాళోజీ తనదృష్టికి వచ్చిన ప్రతి అన్యాయాన్ని ఎదరించాడు. తనకవిత్వం ద్వారా చైతన్యం కలిగించి, కదిలించాడు. ఆధీరత్వం, నిర్భీతి తెలుగు ప్రజలకు నచ్చింది. వారి భాషల్ని తన కవిత్వంలో 'నాగొడవ'గా ప్రకటించాడు కాబట్టే ఆయన్నే ప్రజాకవి అన్నారు.

కాళోజీ మూడు వేలకు (2002) పైగా వచనకవితలను 'నాగొడవ' పేరుతో రాసారు. ఇవన్ని పది సంపుటాలుగా వచ్చాయి. వీటన్నింటిని 2001లో కాళోజీ పౌండేషన్ వాళ్ళు ఒకే సంపుటంగా తెచ్చారు.

ఆయన కవిత్వానికి 'అన్యాయాన్ని ఎదిరిస్తే / నాగొడవకు సంతృప్తి / అన్యాయం అంతరిస్తే / నాగొడవకు ముక్తిప్రాప్తి/ అన్యాయాన్ని ఎదిరించినవాడు నాకారాధ్యుడు. అంటూ తన లక్షణాన్ని నిర్దేశించాడు. ఆయన జీవితాన్ని, సమకాలీన సమాజ సంఘర్షణని కవిత్వాన్ని వేరుచేసిచూడలేము. ఉద్యమాలు, ఆవేదన ఆయనకవిత్వానికి వస్తువులయ్యాయి.

'నాగొడవ' కవితలో తన కవిత్వస్వభావాన్ని ఇది సామాజిక గొడవ, ప్రజలందరి బాధలు, ఆవేదనలకి తన కవిత్వంలో చోటుకల్పించాడు. సరళశైలిలో వ్యక్తీకరించారు.

'నాగొడవనునది
కాళోజీ అనునది...
కాలమునకు ప్రతి కూలముగా
సతతము పారునది పోరునది
కాళోజీ అనునది
కాలమునకే కాదు మహా
కాలునకును ఏనాదును
జీ అనని" ఖలేజాతో కాళోజీ అనునది
నా గొడవనునది
నఖరాలు లేనట్టిది
నాజూకు కానట్టిది
నాగొడవను నది
అక్షరాలజీవనది
నీనాభావననది
నీనాభావనలేనిది
మనభావననది
సమాజాభావననది
'సమరస భావననది
నా గొడవననునది
కాళోజీ అనునది
ఎదచించుక పారునది
ఎదలందున చేరునది
ఎందరాగబట్టినను
ఎక్కిఎక్కి వచ్చునది
ఎడద ఊరిపారునది
ఎడదచేరి ఊరునది
ఎడద చిందించునది
నాగొడవనునది

కాళోజీ అనునది" అని నాగొడవ కవిత్వ ఉద్దేశం, కాళోజీ ఉద్దేశం 'స్పష్టంగా, ఎలాంటి వ్యాఖ్యానం అవసరం లేకుండా నిరంతరం పారేనదిగా ధ్వనిస్తూ స్పష్టంగా చెప్పారు.

కాళోజీ 'నాగొడవ' తొలి సంపుటి 1953 ఆలంపురం లో శ్రీశ్రీ చేతులమీద ఆవిష్కరించారు. ఈ సందర్భంలో శ్రీశ్రీ కాళోజీని గ్రీకు రచయిత, ప్రజాస్వామ్యవాది లూయీ ఆర్గన్‌తో పోల్చారు. దీనిలో కాళోజీ 1940 నుండి 1953 వరకు రాసిన కవితలున్నాయి. ఈ కాలంలో హైదరాబాద్ రాజ్యంలో నిజాం నిరంకుశ ప్రభుత్వ, పోలీసుచర్య, హైదరాబాదు స్టేట్ ఏర్పాటు వంటి ముఖ్య సంఘటనలు అటు కమ్యూనిస్టుల రైతాంగ పోరాటం, ఆంధ్రమహాసభ, ఆర్యసమాజం, జాతీయకాంగ్రెస్ కార్యకలాపాలు, నిజాం ప్రభుత్వం, రాజాకార్ల, దొరలు, పటేలు పట్వారీల దమనకాండలకు స్పందిస్తూ రాసారు.

1939లో నిజాం రాజ్యాంగ సవరణలను "ఎందులకు ఎందులకు? / ఇస్లాహాత్ ఎందులకు / అంటూ నిరసించారు. రాజాకార్ల దుశ్చర్యల్ని 'కాటేసి తీరాలి' కవితలో "మనకొంప లార్చిన / మనస్త్రీలను చెరచిన / మనపిల్లలను చంపి / మనల బంధించిన మానవాధములను మండలాధీశులను... కసి ఆరిపోకుండ బుసకొట్టుచుండాలె / కాలంబు రాగానే కాటేసితీరాలే"..అంటారు.

1966లో వచ్చిన 'పరాభవ' ఉగాది సందర్భంగా అదేపేరుతో ఆరు సంపుటాలు ఒకే సంవత్సరంలో పరాభవ వసంతం, పరాభవ గ్రీష్మం, పరాభవ వర్షం, పరాభవ శరత్తు, పరాభవ హేమంతం, పరాభవ శిశిరంల పేరుతో రాసారు. ఇవన్నీ 2001లోని 'నాగొడవ' సంపూర్ణ సంపుటంలో చేరాయి.

**జీవనగీత :–** ప్రసిద్ధ లెబనాన్ కవి 'కలీల్ జిబ్రాన్' రాసిన "దిప్రాఫెట్" (1883–1931) కవిత్వానికి కాళోజీ అనువాద కావ్యం 'జీవనగీత' ఈ జిబ్రాన్ క్రైస్తవమతస్థుడు అరబ్బీమాతృభాష, అమెరికాలో జీవించి మరణించాడు.

"దిప్రాఫెట్"ని 1953–1968 మధ్య అనువాదం చేసి సభలు, సమావేశాల్లో చదువుతూ, 'బ్రతుకుబాట' అని పేరుపెట్టారు. దీన్ని శశాంక్ 'జీవనగీత'గా మార్చారు. ఇది క్రైస్తవ ఆధ్యాత్మిక గ్రంథం.'ఆర్ఫలీజు' పట్టణంలో 'ఆల్ ముస్తఫ అనేకాలజ్ఞాని ఉంటాడు. ఆయనని ఆల్‌మిత్ర అనే సన్యాసి జీవితం గురించి అనేక ప్రశ్నలు వేస్తే వాటికి సమాధానమే ఈ గ్రంథం.

ఉదాహరణకి :- ప్రేమయిచ్చునది ప్రేమయే / ఇవ్వలేదు ఇంకేదియు / ప్రేమ తీసుకొను ప్రేమయే / తీసుకొనదు ఇంకేదియు / ప్రేమ వశము చేసుకొనదు / వశముకాదు తానెప్పుడు / ప్రేమకు ప్రేమయే చాలును"... అంటూ నిజమైన ప్రేమ తత్వాన్ని జిబ్రాన్ ఆత్మను ఆవిష్కరించాడు.

శ్రమ విలువ దాన్ని శ్రద్ధగా చేయాలంటూ 'శ్రమ యనగా సారారంభైన ప్రేమ /ప్రీతి యుక్తకార్యాచరణంబు మీకు చేతగాక / నిరసన భావంబు తోనే మీరు పనులు చేయుచున్న / అంతకన్న మీరు మీ కార్యకలాపాలు వదలి / ప్రీతి గలిగి శ్రమలోర్చుకు గదియించిన... అంటూ వర్ణించారు ఇలా దీనిలో ఎన్నో భావాలున్నాయి.

**నా దేశ యాత్ర :-** హెచ్.ఎన్.బ్రెయిల్స్‌పర్డ్ రాసిన 'రెబల్ ఇండియా' గ్రంథానికి కాళోజీ 'నాదేశ యాత్ర' స్వేచ్ఛానువాదం. వట్టికోట ఆళ్వారు స్వామిగారు దీన్ని తన దేశోద్ధారక గ్రంథమాల తరఫున 1941లో ప్రచురించారు. బ్రెయిల్స్‌పర్డ్ మన దేశానికి ఒక సంవత్సరకాలం యాత్రికునిగా వచ్చి పరిశీలించి ఈ గ్రంథాన్ని రాసారు. ఆయనదృష్టికోణంలో దేశస్థితి అందరికి తెలియాలనే ఉద్దేశంతో రాసారు. దీన్ని కాళోజీ 1931 సంవత్సరంలో 14 అధ్యాయాలుగా రాసారు. గాంధీజీ జాతీయోద్యమాన్ని అహింసాయుత పోరాటంగా నడపడం, సమకాలీన దేశ సాంఘిక పరిస్థితులు, అన్ని వర్గాల ఆలోచనలు ఇందులో ఉన్నాయి.

**అనువాద రచనలు :-** కాళోజీకి మరాఠి, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో పండితుడు. ఆయా భాషా సాహిత్యాల్లో తనని చైతన్య పరచినదానికి నవల, కథానిక, కవిత్వం, వ్యాసం మొదలైన సాహిత్య ప్రక్రియ రూపాలలో తెలుగు ప్రజలకి అందించారు.

1. మహారాష్ట్ర జానపదసాహిత్యం, భారతీయ సాహిత్యం, మరాఠీ భాషా సాహిత్యం, ఏ.సి.ఫడ్కే 'అంజలి' నవల, సానేగురూజీ, భారతీయ సంస్కృతి, థాట్స్ ఆఫ్ మార్క్స్ మొదలైనవి అనువాదం చేసారు. కానీ ఇవేవి నేడు లభించడంలేదు.

**ఇదీ నా గొడవ :** ఈ 'ఇదీ నాగొడవ' కాళోజీ స్వీయచరిత్ర ఆత్మకథ. దీన్ని కాళోజీ రాయలేదు. సాధారణంగా ఇలాంటి వచన రచనలు రచయితలు రాసుకుంటారు. ఈ సంప్రదాయానికి భిన్నంగా కాలోజీ చెబుతూ వుంటే తూర్పుమల్లారెడ్డి, ఎబికె ప్రసాద్, వాసుదేవరావు, స్మైల్ కాళోజీ అభిమానులు టేప్‌రికార్డులో రికార్డు చేయగా అది 1995లో పుస్తకరూపంలో వచ్చింది.

ఈ పుస్తకం గురించి కాళోజీ 'ఇది నా జీవిత కథ', తారీఖులు దస్తావేజులు లేవు. మా కుటుంబం, స్నేహాలు, సంఘం, సాహిత్యం, రాజకీయాలు వూసులే వుంటాయి అని ముందుమాటలో చెప్తారు. ఇది ఆయన తరం జీవితాన్ని, పాలకుల స్వభావాన్ని కొత్త తరానికి పరిచయం చేసారు. ఆయన మౌఖిక కథనంలో ఆర్ద్రత ఉంది. ఆత్మీయత ఉంది. ఈ మౌఖిక పద్ధతి వల్ల కాలక్రమ పద్ధతి కాకుండా గతం, వర్తమానం, గతం అనే పద్ధతిలో అనేక సందర్భాలున్నాయి. ఇది నిజాం పాలనలో పరిపాలనా స్వరూపానికి,హిందూ, ముస్లింల సామరస్య, వైరుధ్యాలు, 20వ శతాబ్దం అర్థభాగంలో తెలంగాణ జనజీవనం ఎలావుందో అర్థం చేసుకోవచ్చు. ఆయన 2002 వరకు జీవించిన దీనిలో 1950 వరకు ఆయన గడిపిన జీవితం మాత్రమే చోటుచేసుకుంది. ప్రభుత్వాలు మారినా వాటి తీరు మారలేదు. పౌరుల పట్ల ప్రభుత్వాలు కక్ష కట్టరాదంటారు కాళోజీ.

ఈ విధంగా కాళోజీని, సమకాలీన చరిత్రని, ఉద్యమాలని, రచనలను వేరుచేసి చూడలేము. ఎందుకంటే ఆయన గొప్ప మానవతా వాది, సంఘసంస్కర్త. తన సమకాలీన సమాజంలో అటు నిజాం పాలనలోనైనా,హైదరాబాద్ స్టేట్ పాలనలోనైనా, ఇటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనైనా జరిగిన ఉద్యమాలన్నిటితో ప్రత్యక్ష సంబంధం గల ఉద్యమకారుడు. అది ఆర్య సమాజమైనా, మానవహక్కుల ఉద్యమమైనా, నిజాం ప్రభువైనా, ఆంధ్రప్రదేశ్ పోలీస్ ప్రభుత్వమైనా ప్రజాపక్షం వహించి ప్రభుత్వాల గల్లా పట్టుకుని నిలదీసిన నిలువెత్తు ధైర్యం కాళోజీ. ప్రజల కష్టాలను తన కష్టాలుగా వారి దుఃఖానికి కరిగిపోయి కాలవై నదై పారిన గొప్ప మానవత్వం కాళోజీ. తెలుగు సాహిత్య చరిత్రలో కాళోజీతో ఇంకొకరిని పోల్చలేం. ఆయనదొక ప్రత్యేక వాణి, ప్రత్యేక బాణి. నిరంతరం ప్రజల్లో ఉండి తను మొత్తం ప్రజగా మారిన అచ్చమైన ప్రజాకవి కాళోజీ.

**ఆధార గ్రంథాలు :**

1) నాగొడవ – కాళోజీ ఫౌండేషన్, వరంగల్
2) సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు – జి.వి. సుబ్రహ్మణ్యం
3) తెలుగు సాహిత్య సమీక్ష – జి. నాగయ్య
4) వ్యాసప్రపంచం 3సం. – కొడవటిగంటికుటుంబరావు
5) కాళోజీనారాయణరావుజీవితం–వ్యక్తిత్వం – కూర్పు మల్లారెడ్డి